**విశాలభారతి, ఉత్తరాఖండ్ :** మహిళా రిజర్వేషన్లతో ముడిపడి ఉన్న డీలిమిటేషన్ బిల్లుపై ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా ఉమ్మడి నిర్ణయం తీసుకుంటాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్ పర్యటనలో భాగంగా రుద్రపూర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ అంశంపై కాంగ్రెస్ వైఖరి చాలా స్పష్టంగా ఉందన్నారు. ఇటీవల లోక్‌సభలో వీగిపోయిన డీలిమిటేషన్ బిల్లుపై ప్రభుత్వం మళ్లీ ముందుకు వెళ్లాలని చూస్తే, ప్రతిపక్షాల ఫ్లోర్ లీడర్ల సమావేశంలో చర్చించి ఉమ్మడి వ్యూహాన్ని ప్రకటిస్తామని ఖర్గే తెలిపారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా, ప్రస్తుతం ఉన్న 543 సీట్లలోనే మహిళలకు మూడో వంతు (1/3వంతు) రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ (FCRA) సవరణ బిల్లును కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఖర్గే చెప్పారు. ఈ బిల్లుపై డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్, మిజోరం సీఎం లాల్‌దుహోమాతో పాటు పలు మైనారిటీ క్రైస్తవ వర్గాల ప్రతినిధులు ఇప్పటికే తమ అభ్యంతరాలను కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు తెలియజేశారని ఖర్గే చెప్పారు. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపేందుకే తాను ఇక్కడ పర్యటిస్తున్నట్లు ఖర్గే పేర్కొన్నారు. సీట్ల సంఖ్యను పెంచడం ద్వారా ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలకు లేదా దక్షిణ భారత దేశానికి లబ్ధి జరగదని, ఇది కేవలం సెంట్రల్ ఇండియాకే ప్రయోజనం చేకూరుస్తుందని కాంగ్రెస్ నేత మనీష్ తివారీ వ్యాఖ్యానించారు. సీట్లను 850కి పెంచితే లోక్‌సభ చైనా 'నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్'లా తయారవుతుందని తివారీ విమర్శించారు.



# పొలం దూరమై.. పట్నం దిక్కైంది!



**మొదటిపేజీ తరువాయి**

సెక్యూరిటీ గార్డులుగా మారుతున్నారు. రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లు, ప్రైవేటు ఆఫీసుల గేట్ల వద్ద రేయింబవళ్లు పన్నెండు గంటల పాటు నిలబడి విధులు నిర్వహిస్తున్నారు. మరికొందరు షాపింగ్ మాల్స్‌లో హౌస్ కీపింగ్ పనులు చేస్తూ అంతస్తులను శుభ్రం చేస్తున్నారు. ఏమాత్రం అనుభవం లేని ఈ పనులను జీవన పోరాటం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో చేస్తున్నారు. ఒక్క రోజు సెలవు పెట్టినా జీతంలో కోత పడుతుండటంతో అనారోగ్యంతో ఉన్నా విశ్రాంతి తీసుకోలేని దుస్థితి నెలకొంది. పగలు రాత్రి తేడా లేకుండా కష్టపడితేనే నెలాఖరుకు అరకొర జీతం చేతికి అందుతుంది. పుట్టిపెరిగిన ఊరు, కన్నవారూ, కనీస సంతోషాలను దూరం చేసుకొని ఈ మహానగరంలో బతుకు బండిని నెట్టుకొస్తున్నారు. పట్నంలో కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ఈ పేద కూలీలకు భాషా సమస్య తీవ్రంగా వేధిస్తోంది. స్థానిక భాషలు కాకుండా హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ పదాలతో యజమానులు ఇచ్చే ఆదేశాలు వీరికి అస్సలు అర్థం కావడం లేదు. సూపర్ వైజర్లు చెప్పిన పనులు సరిగ్గా చేయలేక అనేకసార్లు వాళ్ళ చేతిలో తీవ్రమైన తిట్లు తింటున్నారు. ఆస్పత్రులలో ఆయాలుగా చేరిన మహిళలు ఇంగ్లిష్ పేర్లతో పిలిచే వైద్య పరికరాలు ఏమిటో తెలియక బిత్తరచూపులు చూస్తున్నారు. చిన్న చిన్న పొరపాట్లకు కూడా అవమానాలు ఎదుర్కొంటూ నిత్యం మానసిక వేదనను అనుభవిస్తున్నారు. అయితే ఊర్లో ఉన్న పిల్లల భవిష్యత్తు కోసం, కడుపు నింపుకోవడం కోసం ఈ అవమానాలన్నింటినీ మౌనంగా భరిస్తున్నారు. తమకు తెలిసిన నాట్లు వేసే వ్యవసాయ నైపుణ్యాలు ఇక్కడ పనికిరాకపోవడంతో, తెలియని పనులే శరణ్యంగా మారుతున్నాయి. ఏనాడు ఎరుగని ఈ కఠినమైన నగర జీవనాన్ని గడపలేక కొందరు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నగరంలో కష్టపడితే వచ్చే అరకొర వేతనం కుటుంబ అవసరాలను తీర్చడానికి ఏమాత్రం సరిపోవడం లేదు. భార్యాభర్తలు ఇద్దరూ వేర్వేరుగా పనులు చేస్తే వచ్చే ఇరవై వేల రూపాయల్లో ఆరు వేలు ఇంటి అద్దెకే ఖర్చవుతున్నాయి. మిగిలిన డబ్బుల్లో తిండి ఖర్చులు పోను, కొద్ది మొత్తాన్ని మాత్రమే పిల్లల చదువుల నిమిత్తం దాచుకుంటున్నారు. పండుగలు వచ్చినా సొంతూరికి వెళ్లే ఆర్థిక స్థోమత లేక నగరంలోనే ఉండిపోవాల్సి వస్తోంది. గ్రామంలో మళ్లీ వర్షాలు కురిచి వ్యవసాయ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయా అని ఎదురుచూస్తున్నారు. వాన జాడ కోసం ఊర్లోని స్నేహితులకు ఫోన్లు చేసి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. వర్షాలు పడితే చాలు వెంటనే పట్నం వదిలి సొంతూరికి పరిగెత్తాలని ఆశపడుతున్నారు. కానీ అలాంటి ఆశాజనక వాతావరణం కనిపించకపోవడంతో ఈ నగరమే ప్రస్తుతం తమకు దిక్కని సర్దుకుపోతున్నారు. కష్టాల కడలిలో ఈ వలస బతుకులు నిత్యం అభద్రతాభావంతోనే ముందుకు సాగుతున్నాయి. గ్రామాలను విడిచి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ఈ పేద కుటుంబాల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఎంతో గౌరవంగా బతికిన చేతులు ఇప్పుడు ఇతరుల ముందు తలవంచి పనిచేయాల్సి వస్తున్నది. తమ దుస్థితిని తలచుకుంటూ ప్రతిరోజూ కన్నీటి పర్యంతమవుతున్నారు. సొంత ఊరు, బంధువులు, కన్నబిడ్డలకు దూరంగా ఉండటం వీరిని మానసికంగా కృంగదీస్తోంది. ఏనాడూ లేని విధంగా హైదరాబాద్ వీధుల్లో సెక్యూరిటీ డ్యూటీలు చేయడం వీరికి తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. అయినప్పటికీ కడుపుమంటను దిగమింగుకుంటూ కాలంతో పోరాడుతున్నారు. పల్లె సీమల్లో ఉపాధి లేకపోవడమే ఈ దుస్థితికి మూలకారణంగా మారుతోంది. ప్రభుత్వాలు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీని మెరుగుపరచాలని వీరు కోరుకుంటున్నారు. తద్వారా తాము మళ్లీ సొంతూరికి తిరిగి వెళ్లే అవకాశం దక్కుతుందని ఆశిస్తున్నారు. అప్పటివరకు ఈ మహానగరంలోనే అజ్ఞాతవాసం చేస్తూ బతుకును నెట్టుకురాక తప్పని పరిస్థితి కొనసాగుతోంది.

# పార్కు పరిరక్షణకు హైడ్రాకు మద్దతుగా ర్యాలీ



**సైబరాబాద్ విశాల భారతి :** జనార్ధన్ హిల్స్ కాలనీలో పార్కు స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడి, తిరిగి అభివృద్ధి చేసిన హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ కాలనీవాసులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కాలనీవాసుల ఆధ్వర్యంలో కొత్తగా అభివృద్ధి చేసిన పార్కులో ఈ కార్యక్రమం జరిగింది. కాలనీకి సంబంధించిన పార్కు స్థలం కొంతకాలంగా ఆక్రమణకు గురైందని స్థానికులు తెలిపారు. హైడ్రా అధికారులు చర్యలు చేపట్టి ఆక్రమణలను తొలగించి పార్కు స్థలాన్ని పరిరక్షించారని పేర్కొన్నారు. అనంతరం మూడు నెలల్లో పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్, స్థానిక ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి కృతజ్ఞతలు తెలుపుతూ కాలనీవాసులు ప్లకార్డులు ప్రదర్శించారు. పార్కు పరిరక్షణకు చర్యలు తీసుకున్న అధికారులకు అభినందనలు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు

### మొయినాబాద్ పరిధిలోని పలు గ్రామాల్లో ఘనంగా ఉత్సవాలు



**మొయినాబాద్, ఆగస్టు 9: (విశాలభారతి)** మొయినాబాద్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆషాఢ బోనాల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. బోనాల సందర్భంగా ఆలయాల వద్ద డప్పు చప్పుళ్లు, మేళతాళాలతో సందడి నెలకొంది. చిన్నారులు సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకోగా, పోతురాజుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయాల వద్ద ప్రత్యేక హారతులు నిర్వహించి గ్రామ ప్రజల సుఖసంతోషాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఉత్సవాల్లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్ గడ్డం లక్ష్మీ వెంకట్‌రెడ్డి, కర్రోల్ల శ్రీధర్, యాలల జైపాల్‌రెడ్డి, గుమ్మాల విక్రమ్‌రెడ్డి, చేగూరి మహేష్‌గౌడ్, కందికొండ మల్లేష్‌గౌడ్, ఈగ వెంకట్‌రెడ్డి, ఎట్టాయా గౌడ్, మెట్టుగారి రాజు, రమేష్‌గౌడ్, యాదిరెడ్డి, భాస్కరచారి, బ్యాగరీ శ్రీనివాస్, మహేందర్‌రెడ్డితో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# హైదర్షా కోట్ గ్రామంలో ఘనంగా బోనాల సంబరాలు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ పరిధిలోని హైదర్షాకోట్ గ్రామంలో ఈరోజు ఆషాడ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలకు అనుగుణంగా గ్రామంలోని బోడ్రాయి మరియు వివిధ అమ్మవారి దేవాలయాలను భక్తులు సందర్శించి, బోనాలు మరియు తొట్టెలను సమర్పిస్తూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో కళకళలాడగా, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు మోసుకుంటూ ఊరేగింపుగా దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పుల మేళాలు, పోతరాజుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అమ్మవారి ఆశీస్సులతో గ్రామానికి శాంతి, సమృద్ధి కలగాలని ప్రార్థించారు. భక్తుల ఉత్సాహంతో కార్యక్రమం అంతా ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. భద్రతా ఏర్పాట్లు కూడా సక్రమంగా నిర్వహించడంతో ఎలాంటి అంతరాయం లేకుండా పండుగ విజయవంతంగా ముగిసింది.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ, పోచమ్మ మాత బోనాలు



**రాజేంద్రనగర్, విశాలభారతి:** గంధంగూడ ప్రాంతంలో శ్రీ రేణుక ఎల్లమ్మ, పోచమ్మ మాత ఆలయంలో బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. జిహెచ్ఎంసి 123వ వార్డు పరిధిలో జరిగిన ఈ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిండిన ఆధ్యాత్మిక వేడుకలుగా నిలిచాయి. పరిసర కాలనీలతో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా మహిళలు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించి, బోనాలు మోసుకుంటూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువత కూడా ఉత్సాహంగా పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు. మంగళవాయిద్యాలు, డప్పు వాయిద్యాల నినాదాలు, భక్తుల నామస్మరణలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. తాగునీరు, విద్యుత్, క్యూ లైన్లు, భద్రత వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎలాంటి అవాంతరాలు లేకుండా కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వినయ్ రెడ్డి మాట్లాడుతూ, "శ్రీ రేణుక ఎల్లమ్మ, పోచమ్మ మాత అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాం. మన సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ రాములు నాయక్, సెక్రటరీ బాబు రావు, ట్రెజరర్ రామ్ రెడ్డి, రామ్ నరేష్, జాయింట్ సెక్రటరీ రాజేందర్, గాల్‌రెడ్డి, రమేష్ గౌడ్, బలయ్య, శ్రీనివాస్ గౌడ్ తదితర ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గంధంగూడలో నిర్వహించిన ఈ బోనాల ఉత్సవాలు భక్తి, సంప్రదాయం, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలిచి స్థానిక ప్రజల్లో ఆధ్యాత్మిక స్ఫూర్తిని నింపాయి.



# సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన అభిమానులు


**పాల్వంచ విశాల భారతి:**

సినీ నటుడు సూపర్ స్టార్ మహేష్ బాబు 51వ జన్మదిన వేడుకలను పాల్వంచలో కృష్ణ మహేష్ సేన ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఉదయం కొత్తగూడెంలోని పూర్ణ థియేటర్‌లో ప్రదర్శించిన మహేష్ బాబు బర్త్‌డే స్పెషల్ షో 'దూకుడు' చిత్రాన్ని వీక్షించేందుకు పాల్వంచ నుంచి వందలాది మంది అభిమానులు తరలివెళ్లారు. అనంతరం పాల్వంచ 43వ డివిజన్‌లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేశారు. తదుపరి పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో డ్యూటీ వైద్యురాలు డాక్టర్ రమ్యతో కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేయడంతో పాటు వారి సహాయకులు, పేదలు, ఆసుపత్రి సిబ్బందికి భోజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మహేష్ సేన జిల్లా అధ్యక్షుడు కనగాల రాంబాబు, ఉపాధ్యక్షుడు రాపాక కాంతరాజు, పాల్వంచ కృష్ణ మహేష్ సేన బాధ్యులు మసూద్, కాంపాటి ప్రసాద్, వీరభద్రం, కాంపాటి మహేష్, నాగరాజు, అష్షు, సారయ్య, సురేష్, రాజు, నవీన్, సాయి, ఈశ్వర్, రాజేష్, రఫి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



# బోనాల వేడుకల్లో సందడి చేసిన మైలర్ దేవ్ పల్లి

**పలు ఆలయాలు సందర్శించిన ఎమ్మెల్యే**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్‌లో తెలంగాణ రాష్ట్ర విశిష్ట పండుగ అయిన ఆషాడ బోనాలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. కాటేదాన్, బుద్వేలు, మధుబన్ కాలనీ, పద్మసాలిపురం తదితర ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొని భక్తిశ్రద్ధలతో ప్రజలు బోనాల ఉత్సవాలను జరుపుకున్నారు. ప్రతి వీధిలోనూ సంప్రదాయ వాతావరణం నెలకొని, మహిళలు బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పిస్తూ ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మైలర్ దేవ్ పల్లి పరిధిలోని పలు అమ్మవారి ఆలయాలను సందర్శించారు. ఉదయం నుంచి వివిధ దేవాలయాలకు విచ్చేసిన ఆయన, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తన మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాలలో నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొని భక్తులతో కలిసి పూజలు నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆషాడ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్ర పండుగ అని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని కోరుకున్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో ఎమ్మెల్యే గారితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు సమర్పిస్తూ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు ఆధ్యాత్మికతతో నిండిపోయి పండుగ వైభవాన్ని ప్రతిబింబించాయి.

## ఎస్సైగా రమేష్‌కు పదోన్నతి.. అభినందనల వెల్లువ

- **పదోన్నతి పొందిన రమేష్‌ను అభినందించిన అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, అడ్మిన్ ఎస్సై మాధవరెడ్డి**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. రమేష్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, అడ్మిన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ మాధవరెడ్డిలు రమేష్‌ను అభినందించారు. పదోన్నతి పొందిన రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారు, సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా రమేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పోలీస్‌శాఖలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ సాధించిన పదోన్నతి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నెక్నంపూర్‌లో భక్తి శ్రద్ధలతో బోనాల వేడుకలు

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక పూజలు**



**రాజేంద్రనగర్, విశాల భారతి:** నార్సింగి సర్కిల్ పరిధిలోని నెక్నంపూర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో ఆదివారం బోనాల పండుగ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మైసమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనాలు సమర్పించి, విశేషంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందించారు. అనంతరం మాట్లాడిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతి, సమృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. బోనాల సందర్భంగా కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు తీసుకువచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. డప్పుల నాదం, జానపద కళలతో వేడుకలు మరింత ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్, కాంగ్రెస్ పార్టీ నెక్నంపూర్ డివిజన్ అధ్యక్షుడు జితేందర్, నాయకులు కిరణ్ కుమార్, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, అహ్మద్ షా ఖాన్, రాజు, రవికాంత్, నరేందర్, శ్రీనివాస్, వేణు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎలమంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


## కప్పపహాడ్ గ్రామంలో ఘనంగా మహంకాళి బోనాలు



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కప్పపహాడ్ గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రీ శ్రీ మహంకాళి అమ్మవారి బోనాలు డప్పు దరువుల మధ్య శివసత్తుల విన్యాసాలతో పోతురాజుల ఆటలతో భక్తులను ఎంతగానో ఆకర్షించాయి. మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గీతా రాములయ్య, బిఆర్ఎస్వి నాయకులు జగదీశ్వర్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కురుమ సంఘ నాయకులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- **బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు**
- **మన్సూరాబాద్ డివిజన్‌లో భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ**



**అబ్దుల్లాపూర్‌మెట్ , విశాల భారతి :** బోనాల పండుగను పురస్కరించుకుని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు అమ్మవారి దేవాలయాలను ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తో కలిసి సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దయ, కరుణాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రఘువీర్ రెడ్డి ,పోచబోయిన జగదీశ్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో అలరించిన భరతనాట్య ప్రదర్శన

**మాదాపూర్ విశాల భారతి:** మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. భరతనాట్యాలయ గురువు కుమారి శ్రీదేవి శిష్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.కార్యక్రమంలో పుష్పాంజలి, గణేశ పంచరత్నం, అడవులు, శ్లోకాలు, వర్ణం, ఇందరికీ భయము ఇచ్చు, భాగ్యదా లక్ష్మీ, శ్రీమన్నారాయణ తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించారు. సంయుక్త, వంశిత, తరుణి, కావ్య, గ్రీష్మ, లాస్య, రన్విత, ధన్య, తిశీత, శ్రీవిద్య, సురేఖ, శాన్వి, అవంతిక తదితరులు తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను మెప్పించారు.సంప్రదాయ భరతనాట్యంలోని అభినయం, హావభావాలు, లయబద్ధమైన నృత్య విన్యాసాలను కళాకారులు చక్కగా ప్రదర్శించడంతో కార్యక్రమ ప్రాంగణం కళాభిమానులతో సందడిగా మారింది. ప్రదర్శనలను వీక్షించిన ప్రేక్షకులు కళాకారులను అభినందించారు.



## యువతను ఉన్నతస్థాయిలో నిలబెట్టే సంకల్పం




**ఆదర్శంగా నిలిచేలా ఎదగాలని మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపు**

**విశాలభారతి ఇబ్రహీంపట్నం :** నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలబెట్టడమే కాకుండా చదువుకున్న యువతను ఉన్నత స్థాయికి చేర్చటం కూడా తన సంకల్పమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. జీవితంలో ఎదుగుదలకు వేసే ప్రతీ అడుగులో తమ సహకారం ఉంటుందని యువతకు ఆయన హామీ ఇచ్చారు. మల్ రెడ్డి యవశక్తి, ఎంఆర్ఆర్ ఫౌండేషన్ నేతృత్వంలో మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి సారథ్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ దృష్ట్యా ఆదివారం దరఖాస్తుల స్వీకరణ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ భ వి ష్య త్ మొత్తం యువత చేతుల్లోనే ఉందని... వారు సరైన మార్గంలో వెళ్తేనే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తారని మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.ఇందులో భాగంగానే ఇక్కడి యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనపై దృష్టి సారించినట్లు తెలిపారు. అభిషేక్ నేతృత్వంలో చేపట్టిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని పోలీస్ ఉద్యోగ అభ్యర్థులంతా వినియోగించుకోవాలని సూచించారు. మన జిల్లాకు పోస్టులు లేవని ఆందోళన చెందుతున్నారని, కొన్ని కారణాలతోనే ఇక్కడ ప్రక్రియ ఆగినట్లు సమాచారం ఉందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, వీలైనంత త్వరగా నోటిఫికేషన్ వచ్చేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు సమయం వృథా చేసుకోకుండా చదువులపై దృష్టిసారించాలని సూచించారు. రేపటి జీవితానికి బలమైన పునాది వేసేలా మా ప్రయత్నం అభిషేక్ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు యువత చేస్తున్న ప్రయత్నాలకు తమ సహకారం ఎప్పటికీ ఉంటుందని మల్ రెడ్డి యువశక్తి సారథి మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి తెలిపారు. సివిల్స్ స్థాయిలో రాష్ట్ర పోలీస్ ఉద్యోగాలకు పోటీ, సిలబస్ ఉన్న తరుణంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయకుండా ప్రిపరేషన్ పైనే దృష్టి సారించాలని చెప్పారు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు తాము చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కే పి వి రాజు, సీఐ మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, నాయకులు మహిపాల్, పాండురంగారెడ్డి, ఈసీ శేఖర్ గౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ భాస్కరాచారి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్లు, ఫిజిక్స్ ఫ్యాకల్టీ రమేశ్ తో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బోనాల బాటలో భక్తిభావం.. అమ్మవారి సన్నిధిలో నవజీవన్ రెడ్డి

- **హయత్‌నగర్‌లో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. ప్రజల సుఖసంతోషాల కోసం అమ్మవారిని వేడుకున్న మాజీ కార్పొరేటర్**
- **భక్తులతో మమేకమై బోనాల సమర్పణ.. కాలనీవాసులకు పండుగ శుభాకాంక్షలు**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలో భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి. రాఘవేంద్ర కాలనీ, ద్వారకామై నగర్, హుడా సాయి కాలనీ, పద్మావతి కాలనీ, బీడీఎల్ కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సతీమణి ఈటల జామున తో కలిసి పలు అమ్మవారి ఆలయాలను సందర్శించిన ఆయన, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని, ప్రతి కుటుంబంపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఆయా కాలనీల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి, భక్తులతో కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కాలనీ వాసులతో ఆత్మీయంగా మమేకమై వారికి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పద్మావతి కాలనీలోని అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, అమ్మవారి దీవెనలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అలాగే బీడీఎల్ కాలనీలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కాలనీ ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించారు. హయత్‌నగర్ ప్రజలంతా సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కళ్లెం నవజీవన్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుతూ అందరికీ ఆషాఢ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ ఎల్.బి.నగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, బీజేపీ ధార్మిక సెల్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ కళ్లెం శంకర్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, నాయకులు వెంకట్ రెడ్డి, ఇట్టబోయిన నర్సింహా, జంగా రెడ్డి, అరుణ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందాచారి, అభిలాష్‌గౌడ్, కాలనీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సంక్షేమ సంఘాల సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు




**చామల కిరణ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** నూతనంగా నియమితులైన టీపీసీసీ మీడియా, పబ్లిసిటీ కమిటీ చైర్మన్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. టీపీసీసీ మీడియా, పబ్లిసిటీ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి ఆయన నాయకత్వం మరింత దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ సిద్దెంకి కృష్ణారెడ్డి, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి పాలడుగు నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి సన్నిధిలో భక్తిభావం.. జక్కిడి ప్రభాకర్ రెడ్డి

- **ఎల్బీనగర్ నియోజకవర్గంలో పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు**
- **బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక : జక్కిడి ప్రభాకర్ రెడ్డి**



**అబ్దుల్లాపూర్‌మెట్,విశాల భారతి :** ఆషాఢ బోనాల పండుగ సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీఎస్ఐ డివిజన్ డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతంలోని రక్త మైసమ్మ ఆలయం, మన్సూరాబాద్ డివిజన్‌లోని పోచమ్మ ఆలయం, జడ్జెస్ కాలనీలోని బంగారు పోచమ్మ-రేణుక ఎల్లమ్మ దేవాలయం, ఇందిరానగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయం, సరస్వతినగర్‌లోని కురుమ సంఘం బీరప్ప దేవాలయం, ఎన్టీఆర్ నగర్ డివిజన్ భారత్‌నగర్‌లోని పోచమ్మ ఆలయం తదితర ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రతి కుటుంబంపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొని భక్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక జీవన విధానంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయాల వద్ద భక్తులతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొన్న ఆయన, ప్రజలతో ఆత్మీయంగా మమేకమై బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి సతీష్ రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు స్వామిగౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు జక్కిడి సత్యతేజ్ రెడ్డి, షామాల్ రెడ్డి, పృథ్వీరాజ్, విట్టల్ రెడ్డి, బుంగ రాజు, శ్రీశైలం, వెంకట్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## పొలానికి వెళ్లిన రైతు.. తిరిగిరాని లోకాలకు

- **సైకిల్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం.. చికిత్స పొందుతూ వృద్ధ రైతు మృతి**
- **చిన్నరావిర్యాల గిజ్జకుంట వద్ద విషాదం.. కేసు నమోదు**

**అబ్దుల్లాపూర్‌మెట్,విశాల భారతి :** తెల్లవారుజామున పొలానికి సైకిల్‌పై బయలుదేరిన వృద్ధ రైతును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నరావిర్యాల గ్రామానికి చెందిన రైతు రామిడి బాల్‌రెడ్డి (73) ఆదివారం తెల్లవారుజామున సుమారు 4.25 గంటలకు ఇంటి నుంచి సైకిల్‌పై పొలానికి బయలుదేరారు. సుమారు 4.34 గంటలకు చిన్నరావిర్యాల గ్రామంలోని గిజ్జకుంట సమీపంలోకి చేరుకున్న సమయంలో ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ఆయన సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాల్‌రెడ్డి రెండు కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఆయనను గాంధీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నప్పటికీ పరిస్థితి విషమించడంతో బాల్‌రెడ్డి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమార్తె పగిళ్ల లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం, డ్రైవర్‌ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

## యువత రాజకీయాలలో రాణించాలి

- **ఎంపీ ఆర్ కృష్ణయ్య**



**ముషీరాబాద్, విశాల భారతి:** యువత రాజకీయాల్లో రాణించాలని ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు. బోనాల పండుగ సందర్భంగా ఆదివారం బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కార్తీక్ పటేల్ ఎంపీ ఆర్ కృష్ణయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ. యువత రాజకీయాలపై మక్కువ పెంచుకొని ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. బీసీల సమస్యలపై వీరోచిత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్తీక్ పటేల్ మాట్లాడుతూ. ఎంపీ ఆర్ కృష్ణయ్య అడుగుజాడలో బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదలపై పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి నాయకులు,సాయి, జశ్వంత్, కౌశిక్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## అటవీ సంపదను కాపాడుతున్న ఆదివాసులు

- **ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం అందించాలి**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పాఠశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేయాలి**
- **సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** దేశంలోని అటవీ ప్రాంతాల్లో ఉన్న సహజ, ఖనిజ సంపదను దేశ మూలవాసులైన ఆదివాసులే పరిరక్షిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం రావి నారాయణరెడ్డి కాలనీలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ గిరిజన సమైక్య అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి శంకర్ నాయక్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బాణావత్ బిక్షం నాయక్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు, వస్త్రధారణతో ప్రత్యేక గుర్తింపు కలిగిన ఆదివాసీ గిరిజనులు నేటికీ అభివృద్ధికి దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించేందుకు ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా అనేక ఆదివాసీ తండాలు, గూడాలు కనీస అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ఇప్పటికీ బడి ముఖం చూడని తండాలు, గూడాలు ఉన్నాయని, ఆదివాసీలకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన విద్య, వైద్యం అందకపోవడం బాధాకరమన్నారు.ఆదివాసీ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. తండాలు, ఆదివాసీ గూడాల్లో ప్రత్యేక పాఠశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆదివాసుల హక్కులు, వారి భూములు, అటవీ సంపద పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, గిరిజన సమాఖ్య మండల సహాయ కార్యదర్శి సరిలాల్, కోశాధికారి లచ్చు నాయక్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు చిర్ర శేఖర్, పేరాల గోపి, వినోద్, ఆవుల యాదగిరి, అశోక్, ప్రియా, శ్రీదేవి, లలిత, క్రాంతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ పేదలకా.. అనర్హులకా..?

- 'ఆసరా'లో అక్రమాలకు అడ్డుకట్ట ఎప్పుడు..?
- కాగితాలపై ఆడిట్.. క్షేత్రస్థాయిలో అక్రమాలా..?
- మరణించిన వారి పేర్లపై చెల్లింపులు..
- ద్వంద్వ పింఛన్లు.. తప్పుడు ధ్రువపత్రాలపై అనుమానాలు

**మహబూబాబాద్ విశాలభారతి:**





పేదల జీవితాలకు అండగా నిలవాల్సిన సామాజిక భద్రతా పింఛన్ పథకంలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వృద్ధాప్యం, వైధవ్యం, దివ్యాంగత్వం వంటి పరిస్థితుల్లో ఆర్థికంగా అండగా నిలిచే పింఛన్ పథకం ఎంతో మంది నిరుపేదలకు జీవనాధారం. అయితే అర్హులైన పేదలకు చేరాల్సిన సంక్షేమ ప్రయోజనం అనర్హుల చేతుల్లోకి వెళ్తే.. అసలు పథకం లక్ష్యమే దెబ్బతింటుంది. మహబూబాబాద్ జిల్లాలో సామాజిక భద్రతా పింఛన్లపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అనర్హులు పింఛన్లు పొందుతున్నారా..? మరణించిన వారి పేర్లపై చెల్లింపులు కొనసాగుతున్నాయా..? ఒకే వ్యక్తికి రెండు పింఛన్లు వస్తున్నాయా..? తప్పుడు ధ్రువపత్రాలతో లబ్ధి పొందుతున్నారా..? అర్హతకు మించిన ఆస్తులు, ఆదాయం ఉన్నవారు కూడా పింఛన్లు పొందుతున్నారా..? అన్న ప్రశ్నలకు అధికార యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**కాగితాల్లో అర్హుడు.. గ్రామంలో అనర్హుడా..?**

పింఛన్ లబ్ధిదారుల అర్హతను కేవలం కార్యాలయాల్లోని రికార్డులు, ధ్రువపత్రాల ఆధారంగా నిర్ధారించడం వల్ల వాస్తవ పరిస్థితులు పూర్తిగా వెలుగులోకి రావు. ఒక వ్యక్తి పేరు రికార్డుల్లో అర్హుడిగా ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అతని కుటుంబ పరిస్థితి భిన్నంగా ఉండే అవకాశం ఉంది. లబ్ధిదారుల కుటుంబానికి ఉన్న భూములు, ఇళ్లు, వాహనాలు, వ్యాపారాలు, ఆదాయ వనరులు, ఉద్యోగ వివరాలు, కుటుంబ సభ్యుల ఆర్థిక స్థితిగతులు వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. గ్రామంలో వాస్తవ పరిస్థితిని తెలుసుకోకుండా కేవలం ఫైళ్ల ఆధారంగా అర్హతను నిర్ధారిస్తే.. అనర్హులు వ్యవస్థలో కొనసాగడానికి అవకాశం ఉంటుంది. ఫైళ్లలో అర్హుడు.. ప్రజల ముందు అనర్హుడు అనే పరిస్థితి తలెత్తకుండా ప్రభుత్వం కఠినమైన తనిఖీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

**సదరం ధ్రువపత్రాలపై సందేహాలకు తెరపడేదెప్పుడు..?**

దివ్యాంగులకు అందించే పింఛన్ నిజమైన దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన పథకం. దివ్యాంగత్వం లేని వ్యక్తులు తప్పుడు ధ్రువపత్రాల ద్వారా పింఛన్ పొందుతున్నారనే ఆరోపణలు ఎక్కడైనా ఉంటే వాటిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. ఒక అనర్హుడు దివ్యాంగ పింఛన్ పొందడం అంటే కేవలం ప్రభుత్వ నిధుల దుర్వినియోగం మాత్రమే కాదు.. నిజంగా అర్హత కలిగిన దివ్యాంగుడి హక్కును హరించడం కూడా. అందువల్ల అనుమానాస్పదంగా ఉన్న సదరం ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం పునఃపరిశీలించాలి. అక్రమంగా ధ్రువపత్రాలు పొందినట్లు నిర్ధారణ అయితే లబ్ధిదారుడితో పాటు అందుకు సహకరించిన వారిపైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

**మరణించినా పింఛన్ ఎందుకు కొనసాగాలి..?**

పింఛన్ వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశం మరణించిన లబ్ధిదారుల వివరాలను సకాలంలో నవీకరించడం. ఒక లబ్ధిదారుడు మరణించిన తర్వాత కూడా అతని పేరుతో పింఛన్ కొనసాగితే.. అది ప్రభుత్వ నిధులపై భారమే కాకుండా పర్యవేక్షణ వ్యవస్థలోని లోపాలను బయటపెడుతుంది. మరణాల నమోదు వివరాలను పింఛన్ డేటాతో అనుసంధానం చేయడం ద్వారా ఇలాంటి సమస్యలను చాలా వరకు నివారించవచ్చు. లబ్ధిదారుడి మరణం నమోదైన వెంటనే సంబంధిత పింఛన్‌ను నిలిపివేసే విధంగా సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. మరణించిన వారి పేర్లపై చెల్లింపులు జరిగితే.. ఆ డబ్బు ఎక్కడికి వెళ్తోంది..? ఎవరి బాధ్యత..? అన్నదానిపై స్పష్టత రావాలి. పింఛన్ లబ్ధిదారుల పూర్తి జాబితాను గ్రామసభల ముందు పెట్టి.. ప్రజల సమక్షంలో క్షేత్రస్థాయి సామాజిక ఆడిట్ నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధమేనా..?" ఈ ఒక్క ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెబితే.. పింఛన్ల వ్యవస్థలో నిజంగా పారదర్శకత ఉందా..? లేక పేదల పేరుతో అనర్హులకు ప్రజాధనం చేరుతోందా..? అన్నది స్పష్టమవుతుంది. నిజమైన అర్హుడి చేతిలో 'ఆసరా' ఉంటేనే ఆ పథకానికి సార్థకత. అనర్హుడి చేతిలో పడితే అది 'ఆసరా' కాదు.. ప్రజాధనంపై భారమే. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మాల జర్నలిస్టుల అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ బేతమళ్ల సహదేవ్ ప్రభుత్వం తక్షణమే పింఛన్లపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, అర్హులైన ప్రతి పేదకు న్యాయం చేయాలని కోరారు.

## పేదల సొంతింటి కల సాకారమే కాంగ్రెస్ లక్ష్యం

**ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి**



**కోదాడ, విశాలభారతి :** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌లో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం కోదాడ పట్టణంలోని పెరిక హాస్టల్ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇల్లు నిర్మించడం మాత్రమే కాకుండా అందులో ప్రజలు సౌకర్యవంతంగా జీవించేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ.. అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పేదల ఇళ్ల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి విద్యుత్, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను కల్పించి ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. పేదలకు సొంత ఇల్లు కల్పించడం కేవలం ప్రభుత్వ బాధ్యతగా కాకుండా.. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా చేపట్టే సంక్షేమ కార్యక్రమంగా భావిస్తున్నామని అన్నారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని వెంకటరత్నం బాబు, వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి, ఆర్డీఓ సూర్యనారాయణ, టీపీసీసీ డెలికేట్ చింతకుంట లక్ష్మీనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే ప్రతినిధి సంతోష్ కిరణ్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన వసతి గృహంలో ఆదివాసి దినోత్సవం



**కోదాడ, విశాలభారతి:** కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీ నగర్ ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో ఆదివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వసతి గృహం వార్డెన్ పద్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్ హెచ్ పి ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోటియా నాయక్, రాష్ట్ర నాయకులు రాజు నాయక్ లు హాజరై, గరిజన పోరాటయోధుడు కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కొమరం భీమ్ త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను చాటేలా వివిధ ఆదివాసి వేషధారణలతో విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు గోపి రాథోడ్, నిఖిల్ నాయక్, ధారావత్ వెంకటేశ్వర్లు, వసతి గృహ సిబ్బంది మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్చిరెడ్డిపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**పినపాక, విశాల భారతి :** పినపాక మండలం ఎల్చిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొప్పుల వీరస్వామి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ములకలపల్లి విష్ణు, కంటెం భాస్కర్, ఎట్టి శ్రీకాంత్, గౌరవ అధ్యక్షులుగా అడపాల వెంకటయ్య, కాళ్ల లక్ష్మణ్, కొప్పుల వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. కార్యదర్శులుగా కొప్పుల కళ్యాణ్, సత్రపల్లి పొట్టయ్య, ఎట్టి అచ్చమ్మ, గోసుల సమత, మడిపల్లి మణికంఠ, ప్రధాన కార్యదర్శులుగా ఇసంపల్లి జంపయ్య, చిన్ని సర్వేష్, కోర్స స్వరూప, కునపురెడ్డి సంధ్య, కాళ్ల నరసింహారావు ఎన్నికయ్యారు. కార్యనిర్వహణ సభ్యుడిగా ఎట్టి సర్వేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా వంకాయల జంపన్న, సత్రపల్లి సాగర్, చల్ల ప్రశాంత్, కొప్పుల సాయిబాబులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని నాయకులు తెలిపారు.

## సేవా స్ఫూర్తితో కోమటిరెడ్డి లక్ష్మీకి జన్మదిన వేడుకలు

- వారణాసిలో అనాథ చిన్నారులకు అన్నదానం
- నిర్వహించిన చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్



**చౌటుప్పల్ విశాలభారతి:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి, కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మీ జన్మదినాన్ని పురస్కరించుకుని పవిత్ర పుణ్యక్షేత్రమైన వారణాసిలో అనాథ చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. జన్మదిన వేడుకలను ఆడంబరాలకు దూరంగా సేవా కార్యక్రమంతో నిర్వహించడం అభినందనీయమని పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ అన్నారు. ఆపదలో ఉన్న చిన్నారులకు అన్నం పెట్టి వారి ఆకలి తీర్చడం ద్వారా మానవత్వాన్ని చాటిచెప్పారని పేర్కొన్నారు. సమాజంలో అవసరమైన వారికి అండగా నిలవడం, సేవా కార్యక్రమాలను కొనసాగించడం ద్వారా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని గోశిక వినయ్ కుమార్ తెలిపారు. పవిత్రమైన వారణాసి క్షేత్రంలో అనాథ చిన్నారులకు అన్నదానం చేయడం మరింత విశిష్టమైన సేవా కార్యక్రమమని అన్నారు. భగవంతుని ఆశీస్సులతో శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మీ సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, దీర్ఘాయుష్షు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవ చేసే అవకాశం కలగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు జరగనున్న ప్రజావాణి రద్దు

**ప్రకటించిన జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ లోని ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని భోనాల పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు అందుబాటులో ఉండరని, ఈ నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు . ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులను అందజేసేందుకు ఐడీఓసీ కార్యాలయానికి రావద్దని ఆయన తెలిపారు.



## విజేతలకు బహుమతుల ప్రదానం





**కోదాడ, విశాలభారతి:** కోదాడ బాయ్స్ హైస్కూల్ మైదానంలో బద్దం కోటిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ పాఠశాలల వాలీబాల్ పోటీలు ముగిశాయి. విజేతలకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి, ట్రస్ట్ చైర్మన్ బద్దం భద్రారెడ్డిల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల అండర్ 18 బాలురు, బాలికల విభాగాల్లో కొమరబండ ప్రథమ, గణపవరం ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్ 14 బాలుర విభాగంలో ఎంజెపి చిలుకూరు ప్రథమ, చిలుకూరు ద్వితీయ స్థానాలు సాధించగా, బాలికల విభాగంలో కొమరబండ ప్రథమ, రామాపురం ద్వితీయ స్థానాలు దక్కించుకున్నాయి. ప్రతిభ చాటిన క్రీడాకారులను ట్రస్ట్ చైర్మన్ భద్రారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఏనుగు ఉపేందర్ రెడ్డి, షేక్ బషీర్, కౌన్సిలర్ సైదిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు చారి, కొండల్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమిద్దాం




- కొమరం భీమ్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి
- ఏఐటీఎఫ్ జాతీయ కమిటీ సభ్యులు గుగులోత్ శత్రు పిలుపు

**మహబూబాబాద్ విశాల భారతి:**

ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం కొమరం భీమ్ స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమించాలని ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కమిటీ సభ్యులు కామ్రేడ్ గుగులోత్ శత్రు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ పట్టణంలోని కొమరం భీమ్ విగ్రహం వద్ద ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గుగులోత్ శత్రు మాట్లాడుతూ.. "జల్, జంగల్, జమీన్ హమారా" అనే నినాదంతో కొమరం భీమ్ సాగించిన పోరాట స్ఫూర్తిని ఆదివాసీ సమాజం కొనసాగించాలని అన్నారు. నాడు ఆదివాసీలు తమ హక్కుల కోసం సాగించిన పోరాటాల ఫలితంగానే ఐదవ షెడ్యూల్, ఒకటి-డెబ్బై చట్టం, పీసా చట్టం, రెండు వేల ఆరు అటవీ హక్కుల చట్టం వంటి చట్టబద్ధమైన హక్కులు సాధించుకున్నామని తెలిపారు. అటవీ హక్కులను హరించే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన అటవీ నిబంధనలతో ఆదివాసీల హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని గుగులోత్ శత్రు ఆరోపించారు. అడవి, అటవీ సంపదపై ఆదివాసీలకు ఉన్న హక్కులను బలహీనపరిచి కార్పొరేట్ శక్తులకు అడవులను, ఖనిజ సంపదను అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. గతంలో ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నా గ్రామసభల నిర్ణయాలు, చట్టబద్ధమైన అనుమతులు కీలకంగా ఉండేవని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ హక్కులను పక్కనబెట్టి కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. ఖనిజ సంపద కోసం అడవులను ధ్వంసం చేస్తున్నారని, దీనిపై ప్రశ్నించే ఆదివాసీలపై అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవులు, జలాలు, భూములు ఆదివాసీల జీవనాధారమని, వాటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. కొమరం భీమ్ నాటి పోరాట స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని, అటవీ సంపదను దోచుకునే కార్పొరేట్ శక్తులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ ఫోరం నాయకులు చింత వెంకన్న, హలావత్ లింగన్న, టీపీజేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ మైస శ్రీనివాస్, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు పర్వత కోటేష్, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు సామ పాపయ్య, తెలబోయిన కృష్ణ, ట్రైబల్ ఫోరం నాయకులు బుర్కా దేవేందర్, బంగారు కృష్ణ, వట్టం ఉమేష్, ఉప్పలయ్య, వెంకన్న, శ్రీశైలం పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లోకి వస్తేనే దేశంలో మార్పు

**డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్**



**మునగాల, విశాలభారతి:** సమాజంలో మార్పు కోసం నీతి, నిజాయితీ గల యువత పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి రావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. మునగాల మండల పరిధిలోని భారాఖాత్ గూడెం గ్రామంలో పచ్చిపాల రామకృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగిన 'నిరుద్యోగ యువత సభ'కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ. 8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వడంతో పాటు కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి, సొంత భవనాలు కేటాయించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు డాక్టర్ నరాల రుక్మారావు, చల్లా గురవయ్య, ధూళిపాల శ్రీనివాస్, ఏనుగుల నాగేశ్వరరావు, పోలోజు మహేష్ చారి, బత్తుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి శాంతియుతంగా జరుపుకోవాలి



**ఆర్మూర్, విశాలభారతి:** వచ్చే వినాయక చవితి పండుగను శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని నందిపేట్ ఎస్సై వినయ్ గ్రామస్తులకు తెలిపారు. ఆదివారం నందిపేట మండలం ఐలాపూర్ గ్రామంలో మన ఊరు మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినాయక చవితికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డి జేల అధిక శబ్దం మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొని వద్దని అన్నారు. మరియు సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలన్నారు, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ నియమాలు, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధాపురం ( మీసాల) లక్ష్మీనారాయణ గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## 'జైలు భరో'ను జయప్రదం చేయండి



**మునగాల, విశాలభారతి:** భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, సూర్యాపేట జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలో ఆగస్టు 10న నిర్వహించనున్న 'జైలు భరో' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మునగాల మండల కమిటీ కార్మికులకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. సెస్ నిధులను ప్రైవేట్ బీమా సంస్థలకు మళ్లించకుండా, కార్మికుల పెన్షన్, విద్యా సహాయం, ఇళ్ల నిర్మాణ పథకాలకు విస్తృతంగా అమలు చేయాలన్నారు. మునగాల మండలంలోని భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలు, కూలీలు అందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి, కోదాడ పట్టణంలో జరిగే ఈ జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మునగాల మండల కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సహాయ కార్యదర్శితో పాటు, మండల కమిటీ నాయకులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

## వరసిద్ధి వినాయక ఆలయ నూతన కమిటీ ఎన్నిక

**నూతన అధ్యక్షులు గా రవ్వ సంతోష్ కుమార్**



**చౌటుప్పల్ విశాలభారతి:** మండలం కొయ్యలగూడెం గ్రామ శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం, కొయ్యలగూడెం గ్రామంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి సర్పంచ్ కరీంకొండ స్వప్న అశోక్, ఉప సర్పంచ్ జెల్ల పవన్, రామాలయం చైర్మన్ మాచర్ల సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆలయ కార్యక్రమాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ నూతన అధ్యక్షులుగా రవ్వ సంతోష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా నూతన డైరెక్టర్లుగా ఏలే మురళి, సూరకంటి మోహన్ రెడ్డి, కొయ్యడి స్వామి గౌడ్, అల్మాస్‌పేట గౌతమ్, రాసాల నర్సింహా, దికొండ ఉదయ్ కిరణ్లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు సర్వసభ్య సమావేశంలో పలువురు అభినందనలు తెలిపారు. ఆలయ ప్రతిష్ఠను మరింత పెంపొందిస్తూ, భక్తుల సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు అందరూ సహకరించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు కోరారు.

# అడవిలోనే ఆదివాసీల బతుకులు!





## రహదారి, విద్యుత్ సౌకర్యాలకు నోచుకోని మారుమూల గిరిజన గ్రామాలు

**పినపాక, విశాలభారతి :**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నా మారుమూల ఆదివాసీ గ్రామాల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు కనిపించడం లేదు. పినపాక మండలంలోని ఉమేష్‌చంద్రనగర్, సుందరయ్య నగర్, విప్పలగుంపు, పిట్టతోగు, తిర్లాపురం, ఎర్రగుంట కాలనీ, చింతలపాడు తదితర గ్రామాల్లో వందలాది కుటుంబాలు నేటికీ కనీస మౌలిక సదుపాయాలకు దూరంగా జీవిస్తున్నాయి. రహదారి, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాలు అందకపోవడంతో వారి జీవనం నేటికీ అడవితో ముడిపడి ఉంది.

వర్షాకాలం వచ్చిందంటే ఈ గ్రామాల ప్రజల కష్టాలు మరింత పెరుగుతున్నాయి. సరైన రహదారి లేకపోవడంతో వారి బాధలు కుటుంబ సభ్యులకు సవాలుగా మారుతోంది. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు గ్రామాలకు చేరుకోలేని పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరింత దయనీయం. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో సాయంత్రం కాగానే గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయి. విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతుండగా సెల్‌ఫోన్ ఛార్జింగ్ వంటి సాధారణ అవసరాల కోసం కూడా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. అభివృద్ధి పరుగులు తీస్తున్న కాలంలోనూ తమ పిల్లలు కనీస సౌకర్యాలకు దూరంగా పెరుగుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్నో అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నప్పటికీ తమ గ్రామాలకు మాత్రం అవి పూర్తిస్థాయిలో చేరడం లేదని ఆదివాసీలు అంటున్నారు. రహదారి, విద్యుత్, తాగునీరు, వైద్యం, విద్య వంటి ప్రాథమిక సదుపాయాలను కల్పించి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుతున్నారు. స్వాతంత్ర్యం అంటే కేవలం జెండా ఎగురవేయడం మాత్రమే కాదని మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రతి కుటుంబానికి కనీస సౌకర్యాలు, భద్రత, గౌరవంతో జీవించే అవకాశం కల్పించినప్పుడే స్వాతంత్ర్య ఫలాలు అందినట్టని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తమ గ్రామాలకు రహదారి, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

**ఆదివాసీ గ్రామాలకు కనీస సౌకర్యాలు కల్పించండి:- టిపిజిఎస్ జిల్లా నాయకులు మడివి రమేష్**

పినపాక నియోజకవర్గం లో ఎంతో మంది ఆదివాసీలు కనీస సౌకర్యాలకు దూరంగా ఉంటున్నారు. వారి పిల్లలు చదువులకు దూరం కావడానికి ప్రధాన కారణం రహదారి విద్యుత్ లేకపోవడం. ప్రభుత్వాలు ఆదివాసీలకు ఏదో చేస్తున్నామని చెబుతున్నారు కానీ దానిలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఇచ్చిన హామీలు నీటి మీద రాతలు గాని మిగిలిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి.

**అడవి బిడ్డలు కనీస సౌకర్యాలు దూరంగా ఉంటున్నారు**

జాతీయ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు గోగ్గల రామకృష్ణ దొర అడవిలో నివసిస్తున్న గిరిజన బిడ్డలకు కనీస సౌకర్యాలు అందడం లేదు. విద్య వైద్య సౌకర్యాలు వారి గ్రామాలకు వెళ్లాలంటే ఇంకా కష్టంగానే మారింది. రాత్రి వేళల్లో వారికి ప్రమాదాలు పొంచి ఉన్న పట్టించుకునే నాధుడు లేదు. ఆదివాసి బిడ్డలకు సరైన విద్య అందాలంటే రహదారి సౌకర్యం తప్పనిసరి. కాబట్టి ప్రతి ఆదివాసి గ్రామానికి రహదారులు ఏర్పాటు చేయాలి. జల్ జంగిల్ జమీన్ అనే నినాదంతో ప్రతి గిరిజనుడు తమ హక్కుల కోసం ఉద్యమం చేయాల్సిందే .



## ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాల నడుమ ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు

- **తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘనంగా నిర్వహణ**
- **సంప్రదాయ వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థులు**
- **ఆదివాసి సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ కిషన్**



**ఆదిలాబాద్, విశాలభారతి:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని స్థానిక తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా విద్యార్థులు ఆదివాసి సంప్రదాయ వేషధారణలో పాల్గొని తమ సంస్కృతిని చాటిచెప్పారు. గిరిజనుల జీవన విధానం, ప్రకృతితో వారికి ఉన్న అనుబంధం, సంప్రదాయాలు, కళలు, నృత్యాల విశిష్టతను తెలియజేసే కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ కిషన్ మాట్లాడుతూ ఆదివాసుల సంస్కృతి, సంప్రదాయాలు మన సమాజానికి అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమై జీవిస్తూ జల, జంగల్, జమీన్ పరిరక్షణకు ఆదివాసులు అందిస్తున్న సేవలు గొప్పవని అన్నారు. విద్యార్థులు ఆదివాసి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.ఆదివాసుల హక్కులు, వారి ప్రత్యేక జీవన విధానం, భాషలు, కళలు, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసి సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మేజర్ గ్రామపంచాయతీ కొడప జలై జాక్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## వైభవంగా సాగిన బోనాల అంబురం

- **ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి నేతృత్వంలో నిర్వహణ**
- **అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు .. పెద్ద సంఖ్యలో తరలిన జనాలు**



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి :** నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద గంజ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో బోనాల పండుగ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి గుమ్మడి కాయ కొట్టి ఉత్సవాలను ప్రారంభించారు. మహిళలకు బోనం ఎత్తి ముందుకు సాగగా.. ఆ ప్రాంతం ఆధ్యాత్మికతను సంతరించుకుంది.. ఈ మేరకు ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా మార్కెట్ యార్డులో బోనాల ఉత్సవాలను ఆనవాయితీగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజల పై ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు, మార్కెట్ కమిటీ సిబ్బంది , కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ ఎంపీటీసీ హన్మండ్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయండి

**తిరుమలగిరి,విశాల భారతి :** తిరుమలగిరి మండలం మామిడాల గ్రామంలో ఆదివారం రోజున సెప్టెంబర్ 8 9 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడవ సభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మండలాధ్యక్షుడు మనోజ్ కుమార్ కోరారు. దానికి సంబంధించి గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ మహాసభకు యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, రాజేందర్, సోమన్న, పవన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## ఇసుక లారీలకు ప్రత్యామ్నాయ మార్గం చూపించండి

**కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోడిశాల రామనాధం డిమాండ్**



**పినపాక, విశాలభారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏడుళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు నుండి కరకగూడెం మీదుగా తాడ్వాయి వరకు వెళ్లే ప్రధాన రహదారిపై ఇసుక లారీల రాకపోకలను తక్షణమే నిలిపివేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఉపాధ్యక్షులు గోడిశాల రామనాధం తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏడుళ్ల బయ్యారం తాడ్వాయి రహదారి సాధారణ ప్రజా రవాణాకు ఎంతో కీలకమైనదిగా మారిందని తెలిపారు. నిత్యం ఈ మార్గంలో రవాణా వాహనాలు భారీ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయని పేర్కొన్నారు. అయితే, గత కొద్దిరోజులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి రోజూ వందల సంఖ్యలో భారీ ఇసుక లారీలు ఈ మార్గం గుండా నిరంతరం తిరుగుతుండటం వల్ల రహదారి తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేవిషయం పై పరిసర ప్రాంత భాధితులు పినపాక, తోగ్గూడెం, గోపాలరావుపేట, కరకగూడెం ప్రజలు ఆశ్రయించి లారీలను నిలిపివేయాలని కోరడంతో ఇసుక లారీలు నిలిపివేయని యెడల రోడ్డు పై ధర్నాకు దిగడానికి కూడ వెనకాడమని తెలియచేసారు.లారీల అతివేగం, పరిమితికి మించిన ఇసుక లోడింగ్ (ఓవర్ లోడ్) వల్ల రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు పడటమే కాకుండా పినపాక, కరకగూడెం, తాడ్వాయి మండలాల ప్రజలు, వాహనదారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సంబంధిత జిల్లా అధికారులు, రవాణా శాఖ యంత్రాంగం తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఏడుళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు వద్ద ప్రత్యేక చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి, ఇసుక లారీలను ఇతర ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రయోజనాలను, ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇసుక లారీల రాకపోకలపై అధికారులు కఠిన దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## అయ్యగారిపల్లిలో కాంగ్రెస్ నూతన కమిటీలు ఏకగ్రీవం



**గ్రామ పార్టీతో పాటు యువజన, సోషల్ మీడియా, బూత్ కమిటీల ఏర్పాటు**

**కురవి విశాల భారతి:**

అయ్యగారిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ జక్కుల మాధవి నాగన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకుల సమక్షంలో కమిటీల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏకాభిప్రాయంతో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దొంగల జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బుర్ర బిక్షపతి, కార్యదర్శిగా మద్దినాల కొమరవెల్లి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా జిన్న రమణ, కందిపాటి సురేష్, బుడిగ రవీందర్, పొన్నబోయిన వీరన్న, కాకి వీరన్న, పొన్నెబోయిన లక్ష్మీనారాయణ, పొన్నాబోయిన శ్రీనివాస్‌లను ఎంపిక చేశారు. యువజన విభాగం అధ్యక్షుడిగా తాడబోయిన లింగబాబు, ఉపాధ్యక్షుడిగా కాకి ప్రవీణ్, కార్యదర్శిగా బొల్లు వేణు ఎన్నికయ్యారు. యువజన కమిటీ సభ్యులుగా బొబ్బల శ్రీకాంత్, బుడిగే అనిల్, షాగాని సందీప్, కందుల యాకన్న, బుర్ర భాను, నరసింగం యాకన్న, శ్రీపతి, పొన్నబోయిన ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు. సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా బుడిగే సుభాష్, ఉపాధ్యక్షుడిగా కడారి రమణయ్య, కార్యదర్శిగా నూకల రమేష్ ఎన్నికయ్యారు. సభ్యులుగా బుర్ర అరవింద్, బొల్లం వినోద్, జిన్న చింటూ, చిన్న అయిలయ్య, అక్కనపల్లి నవనీత్, కందిపాటి చరణ్, జిన్న వెంకటేష్, నాంపల్లి సతీష్‌లను ఎంపిక చేశారు. అలాగే గ్రామంలోని 51వ బూత్‌కు బీఎల్ఏగా బుడిగ రమేష్, 52వ బూత్‌కు బీఎల్ఏగా వడ్లకొండ రాములును నియమించారు. ఆయా బూత్ కమిటీల్లో పలువురు సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై చురుగ్గా స్పందించాలని నూతన కమిటీ సభ్యులు నిర్ణయించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు యువజన, సోషల్ మీడియా విభాగాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల మాధవి నాగన్న, వార్డు సభ్యులు గజ్జి అనిల్‌కుమార్ యాదవ్ దేశ్ముఖ్, బుడిగ రమేష్, వడ్లకొండ రాములుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

## శాంతినగర్‌లో ఘనంగా తొట్టెల కార్యక్రమం



**శేరిలింగంపల్లి విశాల భారతి:** శాంతినగర్‌లో నిర్వహించిన తొట్టెల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఎం నేత కొంగరి కృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొని తొట్టెలను సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా కాలనీ యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లు, భక్తుల సందడితో శాంతినగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి తొట్టెలు సమర్పించారు. కాలనీ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఈ సందర్భంగా కోరుకున్నారు.కార్యక్రమంలో కొంగరి కృష్ణ కుటుంబ సభ్యులతో పాటు కాలనీ యూత్ సభ్యులు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజల ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యే అయ్యా!

**ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డి**



**నిజామాబాద్, విశాలభారతి:** ఇందల్వాయి మండలం దేవి తాండాలో ఆదివారం నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డి సతీసమేతంగా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారా సంప్రదాయ పద్ధతుల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తీజ్ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, బంజారా మహిళలు, యువతులతో కలిసి సంప్రదాయ నృత్యాల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. తీజ్ పండుగ సందర్భంగా పెళ్లికాని యువతులు మంచి భర్తను పొందాలని, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ తొమ్మిది రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపడతారు. గోధుమలతో అంకురాలను పెంచి, సంప్రదాయ నృత్యాలు చేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఈ వేడుకలో ప్రత్యేకత. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి వెదురు బుట్టలను ఎత్తి తీజ్ వేడుకల్లో భాగస్వామ్యమయ్యారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు నవీన్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పొలసాని శ్రీనివాస్, ఉమ్మాజి నరేష్, అంబర్ సింగ్, హన్మండ్లు, దేవి తాండా సర్పంచ్ గణేష్, ప్రజలు, బంజారా మహిళలు, యువతులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి లక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు: బొబ్బిళ్ల మురళి



**చౌటుప్పల్ విశాలభారతి:** కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని, ఆదివారం వారి స్వగృహంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా శ్రీమతి లక్ష్మి గత కొంతకాలంగా పేద ప్రజలకు విద్య, వైద్యం, ఆర్థిక సహాయం తదితర సేవా కార్యక్రమాలను నిరంతరం అందిస్తూ అందరి ఆదరాభిమానాలను పొందుతున్నారని కొనియాడారు."పేద ప్రజల సేవే మా ఆశయం" అన్న స్ఫూర్తితో అహర్నిశలు కృషి చేస్తున్న శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాము. సమాజ సేవలో ఆమె మరింత ముందుకు సాగాలని, ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాను" ఒక ప్రకటనలో తెలిపారు.

## నూతన అధ్యక్షుడికి అభినందనలు



**మరిపెడ ,విశాల భారతి:** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన గుగులోతు రవి నాయక్‌ను పర్కల్‌జాల్‌తండా సర్పంచ్ కొండయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవి నాయక్‌కు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతన అధ్యక్షుడు కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిషాసుర మర్దినికి బోనాలు సమర్పించిన ఆడపడుచులు



**అడవిదేవులపల్లి విశాల భారతి ;** అడవిదేవులపల్లి గ్రామంలో శ్రీ మహిషాసుర మర్దిని అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా గ్రామంలోని ప్రతి గడప నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించారు పోతురాజు నృత్యాలుతో ఆటపాట సందులతో ప్రతి గడప నుంచి అమ్మవారికి ఆడపడుచు అంగరంగ వైభవంగా బోనానికి వేపాకు తోరణాలు పూలతో అలంకరించుకొని అమ్మవారు దేవాలయానికి వచ్చి ఆలయ ప్రధాన అర్చకులు వెల్లటూరి రామ్మోహన్ శర్మ వేదమంత్రాలతో ఆడపడుచులు తీసుకొచ్చిన ప్రతిభనాన్ని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు అనంతరం అంకాలమ్మ ముత్యాలమ్మలకు బోనాలు సమర్పించుకొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు

## కార్మిక హక్కుల కోసం పోరాటం



**మరిపెడ, విశాల భారతి:** కార్మిక, కర్షక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల వీరయ్య ఆరోపించారు. అబ్బాయిపాలెంలో ఆదివారం గుండగాని మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన జీపు జాతా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాల్లో మార్పులు, పని గంటల పెంపు, ఉద్యోగ భద్రతపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, పేదలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జైలుభరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాణాల రాజన్న, గుండగాని మధుసూదన్, నందిపాటి వెంకన్న, కొండ ఉప్పలయ్య, జిన్న లచ్చన్న, తాటికొండ అనంతాచారి, నలబోలు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## రవి నాయక్‌కు ఘన సన్మానం



**మరిపెడ విశాల భారతి:** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన గూగులోతు రవి నాయక్‌ను ఆదివారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రవి నాయక్‌కు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన అధ్యక్షుడు కృషి చేయాలని ఆకాంక్షించారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు నరేష్ నాయక్, సర్పంచ్ పొట్టి గౌతమ్, కొండయ్య, రఘునందన్‌రెడ్డి, గదగాని నరేష్, రెడ్డి నాయక్, గోపి, వెంకన్న, వీరన్న, రవీందర్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బలహీనవర్గాల బలం పుంజాల శివశంకర్

**దేశం స్వాతంత్ర్యం కోసం ఊపిరాడకుండా పోరాడుతున్న రోజులవి. 1929 ఆగస్టు 10న పుట్టిన ఒక బాలుడు, రాబోయే 70 ఏళ్లలో భారత న్యాయవ్యవస్థ, రాజకీయం, పరిపాలన అనే మూడు స్తంభాలకు తన చేతులతో పునాదులు వేస్తాడని ఎవరు ఊహించారు?**



పుంజాల శివ శంకర్ న్యాయవాదిగా మొదలై, న్యాయమూర్తిగా ఎదిగి, మంత్రిగా దేశాన్ని నడిపి, గవర్నర్ గా రెండు రాష్ట్రాలకు తండ్రిలా నిలిచిన అరుదైన వ్యక్తిత్వం. ఏ పదవి ఇచ్చినా దానికి గౌరవం తెచ్చిన గొప్ప నాయకుడు. ఆయన జీవితం ఒక తెరిచిన పాఠ్యపుస్తకం. ఎందుకంటే అధికారం కోసం కాకుండా ప్రజాసేవ కోసం బతికిన చరిత్ర ఆయనది. అమృత్ సర్ హిందూ కళాశాలలో బీఏ, హైదరాబాద్ ఉస్మానియా లా కాలేజీలో ఎల్ఎల్బీ చదివారు. చదువు పూర్తయ్యాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా అడుగు పెట్టారు. 19741975లో నేరుగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆ రెండు ఏండ్లు ఆయనకు చట్టం అంటే ఏంటో, ప్రజల బాధ అంటే ఏంటో నేర్పాయి. ఎమర్జెన్సీ సమయంలో దేశమంతా గందరగోళంలో ఉన్నప్పుడు, అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తరపున కోర్టుల్లో వాదించి, ఆమెపై వచ్చిన ఆరోపణలను కొట్టివేయించడంలో శివ శంకర్ పోషించిన పాత్ర చాలా కీలకం. అక్కడే ఇందిరా గాంధీకి ఆయనపై నమ్మకం కుదిరింది. 1979లో సికింద్రాబాద్ నుండి లోక్‌సభకు తొలిసారి ఎన్నికయ్యారు. ఇక అక్కడి నుండి వెనక్కి తిరిగి చూడలేదు. శివ శంకర్ ని కేవలం ఒక మంత్రి గానే చూడలేం. ఆయన చేపట్టిన ప్రతి శాఖలో ఒక సంస్కరణ జరిగింది. న్యాయశాఖలో చారిత్రాత్మక నిర్ణయం 1981 మార్చి 18. శివశంకర్ జీవితం లోనే కాదు, భారత న్యాయవ్యవస్థ చరిత్రలోనే కీలక మలుపు. అదనపు న్యాయమూర్తులను ఒక హైకోర్టు నుండి మరో హైకోర్టుకు బదిలీ చేసే అధికారం కేంద్రానికి ఇస్తూ అన్ని రాష్ట్రాల గవర్నర్లు, సీఎంలకు సర్క్యులర్ పంపారు. "కులం, బంధుత్వం, ప్రాంతీయత వంటి సంకుచిత ధోరణులను దాటి జాతీయ సమైక్యతను పెంచడానికి" అని ఆ సర్క్యులర్ స్పష్టంగా పేర్కొంది. ఈ ఒక్క నిర్ణయం నేటికీ కొలీజియం వ్యవస్థకు, న్యాయమూర్తుల బదిలీలకు ఆధారం. న్యాయం అంటే కోర్టు గదిలోనే కాదు, వ్యవస్థలో కూడా ఉండాలని నిరూపించారు. దేశ ఆర్థిక వెన్నెముక అయిన చమురు రంగాన్ని శివ శంకర్ పెట్రోలియం శాఖ మంత్రిగా ఉన్న సమయంలో క్రమబద్ధీకరించారు.విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా ప్రపంచ వేదికపై భారత్ గొంతును బలంగా వినిపించారు. ఇందిరా, రాజీవ్ గాంధీ మంత్రివర్గాల్లో అత్యంత విశ్వసనీయ మంత్రిగా మంచి పేరు తెచ్చుకున్నారు.1978, 1980, 1985లో లోక్ సభ సభ్యుడిగా గెలిచారు. 1985లో గుజరాత్ నుండి రాజ్యసభకు వెళ్లి 1993 వరకు కొనసాగారు. 1989 1990 వరకు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా గళమయ్యారు. 69 ఏళ్ల వయసులో రాజకీయం నుండి తప్పుకుంటారనుకున్న సమయంలో తెనాలి నుండి పోటీ చేసి టీడీపీ సిట్టింగ్ ఎంపీ శారదా తాడిపర్తిని ఓడించారు. ప్రజల కోసం ఆయన ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదని మరోసారి నిరూపించారు.

### బీసీల గొంతుక - చివరి శ్వాస వరకు పోరాటం

శివ్ శంకర్ గారి జీవితంలో అత్యంత గర్వించదగ్గ అధ్యాయం ఇదే. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చరిత్రలో సుస్థిరంగా నిలిచిపోతుంది. బీసీల జీవన ప్రమాణాలు పెంపొందించడానికి, వారి హక్కుల కోసం ఆయన నిరంతరం ప్రభుత్వాలతో మాట్లాడారు, పోరాడారు. బీసీలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రంలో గళం వినిపించారు. పదవుల్లో ఉన్నప్పుడు మాత్రమే కాదు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా బీసీల సమస్యలను పార్లమెంట్ లో లేవనెత్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే బీసీల గొంతుకై నిలిచిన నాయకుడు శివ్ శంకర్. పేదలకు సేవ చేయడమే ధ్యేయంగా పోరాడారు. పి. శివ్ శంకర్ జీవితంలోని అత్యంత ప్రకాశవంతమైన అధ్యాయం బీసీ, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం ఆయన చేసిన అలుపెరగని పోరాటం. జూనియర్ లాయర్ గా ఉన్నప్పటి నుండే స్వతంత్ర భారతంలో బీసీలు నిరంతరం మోసపోతున్నారని గ్రహించారు. వారి స్థితిగతులు మెరుగుపర్చడానికి అప్పుడే కంకణం కట్టుకున్నారు. మాడపాటి హనుమంతరావు హైదరాబాద్ మేయర్ గా ఉన్న సమయంలో ఆయనకు పర్సనల్ అసిస్టెంట్ గా పని చేస్తూనే, అనాటి సీఎం బూర్గుల రామకృష్ణారావును కలిసి రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాల జాబితా తయారు చేయాలని పట్టుపట్టారు. ఆయన చొరవ ఫలితంగానే కాకా కలేల్కర్ కమిషన్ సూత్రాల ఆధారంగా బూర్గుల ప్రభుత్వం మొట్టమొదటి బీసీ జాబితాను వెలువరించింది. ఆ రోజుల్లో బీసీల కోసం పోరాడిన వాళ్ళల్లో శివ్ శంకర్ కూడా ముందు వరుసలో నిలిచారు. బీసీల కోసం నాయకత్వం వహించారు. బలహీన వర్గాల కోసం అనేక సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేశారు. నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య ప్రభుత్వాల కాలంలోనూ బీసీల హక్కుల కోసం నిరంతరం శ్రమించారు. "జాబితా తయారీకి ముందు ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటుతనంపై శాస్త్రీయ అధ్యయనం జరగాలి. అలాంటి జాబితానే కోర్టుల్లో నిలబడుతుంది" అని అధికారులకు స్పష్టం చేశారు. ఆయన చేసిన కృషి ఫలితంగానే తూర్పు కాపులను బీసీ కేటగిరిలో చేర్చారు. నేడు వారు అన్ని రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారు. చివరి శ్వాస వరకు బీసీల గొంతుకై నిలబడిన శివ్ శంకర్, ఇందిరా గాంధీకి న్యాయం కోసం కోర్టులో పోరాడి, ఆ తర్వాత ఆమె మంత్రివర్గంలోనే న్యాయ శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. అది ఆయన నిబద్ధతకు, నమ్మకానికి నిదర్శనం.

1929లో పుట్టి, ఒక శతాబ్దపు భారత్ ను చూసిన శివ శంకర్ జీవితం మనకు చెప్పేది ఒకటే అధికారం శాశ్వతం కాదు, కానీ నిజాయితీ శాశ్వతం అని నిరూపించారు. గొంతుకకు, న్యాయానికి నిలబడిన ఆ మహానుభావుడికి జయంతి సందర్భంగా నివాళి.

## గవర్నర్‌గా రెండు రాష్ట్రాలకు రాజధర్మం

**1994 నుంచి 1995 వరకు సిక్కిం గవర్నర్ గా, 1995 నుంచి 1996 వరకు కేరళ గవర్నర్ గా సమర్థవంతంగా, చాలా క్రియాశీలకంగా పనిచేశారు.గవర్నర్ అంటే రాజ్ భవన్ లో కూర్చునే పదవి కాదని, ప్రజల మధ్యకు వెళ్లే బాధ్యత అని నిరూపించారు. పర్వత రాష్ట్రం సిక్కిం నుండి తీర ప్రాంత కేరళ వరకు, రెండు పూర్తి భిన్న సంస్కృతులకు గవర్నర్ హోదాలో ఒకేలా న్యాయం చేశారు. శివ శంకర్ ఈరోజు మన మధ్య లేకపోవచ్చు. కానీ.. ఆయన రాసిన ప్రతి సర్క్యులర్, ఆయన వాదించిన ప్రతి కేసు, ఆయన సంతకం చేసిన ప్రతి ఫైల్ ఇప్పటికీ దేశాన్ని నడుపుతున్నాయి. ఆయన రాసిన పుస్తకం అదొక్కటే ముగింపు చదివితే మనకి ఎన్నో విషయాలు బోధపడతాయి. ఆయనని అనుచరించడం అంటే ఆయన ఫోటోలు పెట్టడం కాదు, విగ్రహాలు కట్టడం కాదు.. శివశంకర్ చూపిన దారిలో నడవడం, ఆయన ఆచరించిన సిద్ధాంతాల కోసం పనిచేయడం నేటి తరం, రాజకీయ నేతలు శివశంకర్ కు అర్పించే నిజమైన నివాళి.**



**సాగర్ వనపర్తి, పొలిటికల్ అనలిస్ట్**

# బ్రాహ్మణ అభ్యున్నతికి కృషి చేద్దాం



- **కరివెన సేవలు నిరుపమానమైనవి**
- **ఆ మహాయజ్ఞం లో మనం సైతం.**

**సైబరాబాద్ - విశాల భారతి**

బ్రాహ్మణ అభ్యున్నతికి సమాజం లోని బ్రాహ్మణ ప్రముఖులు ఇతోధికంగా కృషి చేయాలని, దేశంలోని వివిధ ప్రాంతాల్లో అన్నదాన యజ్ఞం నిర్వహిస్తున్న కరివెన సత్రాల సేవల్లో పాలు పంచుకోవాలని పలువురు బ్రాహ్మణ ప్రముఖులు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ గోపానపల్లి లో ఉన్న బ్రాహ్మణ సంక్షేమ భవన్ లో బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అఖిల భారతీయ బ్రాహ్మణ కరివెన నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనం కు కేంద్ర మాజీ మంత్రి శ్రీ అశ్విన్ కుమార్ చౌబే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బ్రాహ్మణుడు తన ధర్మాన్ని ఆచరించడం పై శ్రద్ధ తీసుకోవాలి అని అన్నారు. కరివెన సత్రాల సేవల్లో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పరంగా సహకారాన్ని అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి సర్కారు నుంచి, తెలంగాణ లో ఉన్న కరివెన సత్రాల శాఖలకు ఎటువంటి సహకారం కావాలన్నా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బ్రాహ్మణులు కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధ్యమే అని స్పష్టం చేశారు. మరో బ్రాహ్మణ ప్రముఖులు సుభాష్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ బ్రాహ్మణ జాతి చేతుల్లో ఉంది అని అన్నారు. కరివెన సత్రాల కమిటీ బ్రాహ్మణ సమాజానికి చేస్తున్న సేవలు నిరుపమానమైనవి అని కొనియాడారు.బ్రాహ్మణ సంక్షేమం కోసం తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అని స్పష్టం చేశారు. సత్రాల కార్యదర్శి డాక్టర్ ఎన్.వేణుగోపాల్ తన కార్యదర్శి నివేదిక లో సత్రాల నిర్వహణ గురించి, భవిష్యత్ లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. సత్రం కమిటీ అధ్యక్షుడు ఎన్ఆర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సలహామండలి ఛైర్మన్ హర్కరే శ్రీనివాస్,గౌరవ అధ్యక్షులు కామరాజు నరేంద్ర, ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రదీప్, బ్రాహ్మణ ప్రముఖులు మైలవరపు శ్రీనివాసరావు,గజల్ శ్రీనివాస్, సత్రం కోశాధికారి గోపాలుని హరిహరరావు,సహాయ కార్యదర్శులు చిదంబర రావు,కాళంరాజు రామకృష్ణ, కమిటీ సభ్యులు ఎస్వీ రావు,సీతారామయ్య, మనోహర్, ప్రభాకర్, మూర్తి,అడవి రాంబాబు, సలహామండలి సభ్యులు చింతపల్లి సుబ్రహ్మణ్యం,కలగ రాఘవ, హైదరాబాద్ నగర బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి

**తిరుమలగిరి, విశాల భారతి:**

ఆదివారం తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని, సెప్టెంబర్ ఒకటిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గోడ ప్రతులను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఎల్లంల యాదగిరి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలన నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని, అలాగే సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను, ధరల పెరుగుదలను వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయస్థాయిలో పోరాటాలు ఉధృతం చేస్తుందని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న ఈ దశాబ్దం క్రమంగా ఆందోళన నిరసన మరియు పెరుగుతున్న కష్టాలకు దారితీసింది. యువత పోటీ పరీక్షల కోసం ఏళ్ల తెరపడి సన్నద్ధమవుతుంటే నియామకాలు ఆలస్యం కావడం,రద్దు కావడం లేదా వరుస పేపర్ లీకేజీల వల్ల పక్కదారి పట్టడం వంటివి జరుగుతున్నాయి.



# కాలాన్ని దాటి ప్రపంచాన్ని చుట్టివచ్చే యోధుడు

సినీప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఎస్ఎస్ రాజమౌళి 'వారణాసి' చిత్రం నుంచి రెండు ప్రత్యేకమైన స్టిల్స్‌ను మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసింది. ఈ స్టిల్స్‌లో మహేశ్ 'రుద్ర'గా నేచురల్ లుక్‌లో తొలిసారి ప్రపంచానికి కనిపించారు. పాలసంద్రంలో శేషపాన్పుపై సేదతీరే శ్రీమహావిష్ణువులా దట్టమైన అడవి మధ్యలో ఒక వెదురు తెప్పపై విశ్రాంతి తీసుకుంటున్న రుద్రను ఓ స్టిల్‌లో చూడొచ్చు. అలాగే.. కెన్యాలోని మసాయి మారా మైదానంలో జిరాఫీలు, క్రూరమృగాల మధ్య నిలబడి, వెనక్కి చూస్తున్న రుద్రను మరొక స్టిల్‌లో చూడొచ్చు. రుద్ర పాత్ర తీరుతెన్నుల్ని ఆవిష్కరించేలా ఈ రెండు స్టిల్స్ కనిపిస్తున్నాయి. 'వారణాసి' సినిమా సోల్‌ని కూడా సూచాయగా ఈ స్టిల్స్ చెబుతున్నాయి. కాలాన్ని దాటి ప్రపంచాన్ని చుట్టి వచ్చే ఓ వ్యక్తి ప్రయాణమే ఈ సినిమా అని మేకర్స్ చెబుతున్నారు. రాజమౌళి ఈ మేరకు తన సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. 'అసాధ్యమైన కార్యాన్ని సుసాధ్యం చేసేందుకు జన్మించినవాడు రుద్ర. అతను చమత్కారి. సున్నితమైనవాడు. ఉగ్రరూపం దాల్చగలడు. ఉగ్రంగా కనిపించే పాత్రను ఎవరైనా పోషించగలరు. కానీ ఒకేసారి ఉగ్రంగా, సున్నితంగా అభినయించగలవారు తక్కువమంది ఉంటారు. అందుకే ఈ పాత్రకు మహేశ్‌ని ఎంచుకున్నాను. మా ఆఫ్రికా షెడ్యూల్‌లో తీసిన స్టిల్స్ ఇవి. ఏ సెట్ ఇవ్వలేని అనుభూతిని మాకు ఆ నేల ఇచ్చింది. కిలిమంజారో చుట్టూ మసాయి మారాలో షూటింగ్ చేస్తున్నప్పుడు నేను నిజంగా నివ్వెరపోయాను. ఉదయాన్నే మా కళ్ల ముందు కనిపిస్తున్న అందాన్ని ఐమ్యాక్స్ కెమెరా కూడా క్యాప్చర్ చేయలేదని మాకు అనిపించింది' అంటూ పోస్ట్‌లో రాజమౌళి పేర్కొన్నారు. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయక పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న సినిమా విడుదల కానున్నది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.